


గాత్ర కచేరిని ప్రదర్శిస్తున్న బి.భార్గవి

# భార్గవిగానంలో ఉట్టిపడిన సంప్రదాయం

ఆళ్వార్‌పేట (చెన్నై),
జనవరి 17 ప్రభాతవార్త

వర్ధమాన గాయని, చిత్రవీణగడేష్ శిష్యురాలు బి.భార్గవి గళం నుంచి వచ్చిన గానం సంప్రదాయ బద్ధంగా ఉంది. నాదిన్బం, సంక్రాంతిని పురస్కరించుకుని బి.భార్గవి గాత్ర కచేరిని రాగ సుధ హాలులో ఏర్పాటు చేసింది. కరూర్ సహోదరులు సమకూర్చిన శ్రీరాగ వర్ణలతో ఆదితాళంలో కచేరి ప్రారంభమవడం సదభిప్రాయాన్ని కల్గించింది. స్వాతి తిరునాళ్ రచించిన 'దేవదేవ' అనే కీర్తనను మాయా మళవగౌళరాగం-రూపకం తాళంలో గానం చేసి సెహభాష్ అన్పించుకున్నారు. సహనా రాగాన్ని ప్రధానాంశంగా ఎంపిక చేసి, 'సెరియవరె' అనే కీర్తనను విస్తార రాగాలాపన, సుదార్ఘ స్వరప్రస్థానంతో గానం చేసి తిరుపతి నారాయణస్వామి అంతరంగాన్ని సరియైన విధంగా వ్యక్తం చెయ్యడం భావయుక్తంగా ఉంది.

సుబ్బరాయ శాస్త్రి రచించిన 'జనని నిను వినా' అనే కీర్తనను రీతిగౌళ రాగం మిశ్రచాపు తాళం మేళవింపులోను, జీఎన్‌బీ రచించిన 'సరస్వతి నమోస్తుతే' అనే కీర్తనను సరస్వతి రాగం రూపకం తాళంలోను, శ్రీత్యాగరాజస్వామి రచించిన 'స్వరరాగసుధ' అనే కీర్తనను శంకరాభరణం రాగంలోను గానం చేసి గురువు శిక్షణకు సార్థకత చేకూర్చినందున, సంగీతప్రియుల విశేషస్పందనను సులువుగా పొందగలిగారు. ఊత్తుకాడు వెంకట సుబ్బయ్య రచించిన 'హాలదార' అనే కీర్తనను మణిరంగు రాగం ఆదితాళం మేళవింపులో చివరి అంశంగా గానం చేసిన తీరు ఎంతో బావుంది.

ఈ కార్యక్రమానికి, లావణ్య (వయొలిన్) భరద్వాజ్ (మృదంగం)లు అందించిన సహకారం, గాయని విద్వత్‌కు ప్రత్యేక శోభను కల్గించడంతో పాటు, వారి విద్వత్ సంపూర్ణంగా వ్యక్తమయ్యే విధంగా ఉంది.